# మనిషి చేసిన దేవుడు

"అమ్మ ఆరోగ్యం బాగులేదు. వెంటనే బయలుదేరిరా."

—అక్షరాలా ఎనిమిదో సారి చదువుకున్నాడు డాక్టర్ రఘునాధ శర్మ.

22 వ తారీఖున ఇచ్చిన టెలిగ్రాము.

23 సాయంకాలం అందింది.

తపాలాశాఖమీద డాక్టర్ రఘు ప్రేమ తగ్గిపోయింది.

*　　　*　　　*

"ఈ భరతవర్షంమీద సవాలక్ష ప్రదేశాలు—ఇంతకన్న మంచివి, ఉండగా మనవూరి పొలిమేర పరమేశ్వరు డున్భవించడం అసామాన్యం మాత్రమే కాదు, అది మన పూర్వజన్మ సుకృతం కూడాను.... 'సంభవామి యుగే యుగే' అని వూరికేనే అన్నారటండీ మహానుభావులూ!" అన్నాడు సిద్ధాంతి జంధ్యాన్ని కుడిచేతివేళ్ళ మధ్య నలుపుతూ.

"అవునవును! భగవంతుడు శివలింగరూపాన ఆవిర్భవించడం అన్నది ఈ కలికాలంలో నమ్మరానిదే....అయినా ఆ పరమాత్ముడి లీలలు తెలియడానికి మనమెంతమాత్రం!"

"అయితే కామరాజుగారూ! తనంతట తానై మన గ్రామానికి వచ్చిన ఈశ్వరుడినలా ఎండకూ, వానకూ ఎన్నాళ్ళని వదిలేస్తాం?" అన్నారు

కలిసి ఓ శుభముహూర్తాన ఆలయానికి పునాదివేయించవద్దూ?" అని సలహా ఇచ్చాడు మల్లికార్జునం.

అతడివైపు దీక్షగా దృష్టి సారించారు కామరాజు. సూర్యకాంతితో ఆడుకుంటున్న ఆయనచెవులదుద్దులు ఎర్రగా నవ్వితే కళ్ళలోని కాంతమ్మ మందలించింది. మల్లికార్జునశాస్త్రి పాతికేళ్ళ ఫాలభాగమ్మీది గంధపు రేఖలకు స్వేదబిందువులు గండ్లుపుట్టాయి.

కామరాజు పలికారు : "అబ్బాయీ మల్లికార్జునం! ఆ అపర్ణాపతి మనం ఆహ్వానిస్తే వచ్చాడా నాయనా?.... అంతా మనచాదస్తం కాకపోతే లయకర్తకు సూర్యుడెంతా, వరుణుడెంతా?"

"మీ అభిప్రాయం నిజమేకాని కామరాజుగారూ, మా అబ్బాయి చెప్పినట్లు ఓ ఆలయమంటూ కట్టిస్తే పామరజనాళిలో భక్తి పెంపొందుతుంది ధర్మదేవత కుంటిదయిన ఈ కాలంలో ఆస్తికత్వం అభివృద్ధిచెందడానికి ఆమాత్రం తోడ్పడ్డానికన్న పుణ్యకార్యం ఏముంది చెప్పండి?"

"అదీ నిజమేనండి సిద్ధాంతిగారూ! కాని మనవూరి పరిస్థితులు మీకు తెలియనివా...."

"వెధవ పంటకాల్వకోసగాదాలూ, ఎన్నికల కొట్లాటలూ మన మహత్కార్యానికి అడ్డొస్తాయంటారా కామరాజుగారూ?"

"నువ్వూరుకోరా అబ్బాయ్! పంతులుగారిని చెప్పనియ్యి...."

కామరాజు చెప్పారు!

"దేవుడున్నాడనడం దోషంగా భావించేవాళ్ళు, దేవుడు లేడనడం నాగరికతగా భావించేవాళ్ళు మనవూళ్ళో ఎక్కువవుతున్నారని మరచిపోతున్నారుకదా?"

"అవన్నీ ఈ యుగపు లక్షణాలని బ్రహ్మంగారి వాక్కుండనే ఉందిగా! అయినా మీరూ, అహోబలశ్రేష్ఠిగారూ, తాశీల్దారునాయుడుగారూ కలిస్తే కానిపని గల ధీరుడింకా ఈ వూళ్ళో పుట్టలేదు కదండీ—"

"సిద్ధాంతిగారూ, మేల్కొనివున్న ప్రతీక్షణమూ ఆ దివ్యమంగళ విగ్రహందిసాన్నిధ్యంలో ఆయిన అర్చనలో ఉండగల్గిన భాగ్యవంతులు—మీకు–దైవకార్యంలో ఆమాత్రం ఆశాభావం ఉండడం సహజమే నను–"

—"నాన్నా! లోపలికి రావాలి." తలుపువారగా నిల్చుని పిల్చింది లలిత.

కామరాజు లేచారు; "మళ్ళీ సాయంకాలం నేను ఆలయానికి వచ్చినప్పుడు మాట్లాడుదాం సిద్ధాంతిగారూ!"

మల్లికార్జునం కంటికి తలుపులే కనపడుతున్నాయి.

"అలాగేలెండి!....అమ్మగారి కెలావుంది? కాస్త మెరుగ్గా—"

"అ....అదే మెరుగూ!... చయన్ల భస్మాలేవీ నాటడంలేదు...."

"పెద్దబ్బాయిగారిని రప్పించి మందిప్పిస్తే...."

"నిన్ననే వాడికి టెలిగ్రాం ఇచ్చాము–"

"నాన్నా!"

"వస్తున్నానమ్మా!" అని లోపలికి వెళ్లారు కామరాజు.

చేతులూ కాళ్ళూ విలవిల విదిలిస్తూంది, కండ్లు సగం మూసుకుని ఉన్నాయి. పెదవులమూలలనుండి చొంగ కారుతూంది. పటపట కొరుకుతున్న పళ్ళసందునుండి వికృతమైన మూలుగువస్తూంది. అలవాటులేని ఈ కదలికలకు దేహం అలసిపోయింది. చెమటకు తడిసిన కుంకుమ నొసటంతా వ్యాపించింది.

చేతులూ కాళ్లూ అదిమిపట్టి అక్కయ్యవిశ్చలంగా ఉండేటట్లు చేయాలని ప్రయత్నిస్తూంది లలిత.

కామరాజు పిలిచారు: "అమ్మాయ్, గౌరీ!"

"అక్కయ్యకు వినపడదు నాన్నా" అని అక్కయ్య నోట్లో రుమాలు తురిమింది లలిత.

"చిన్నవాడేడీ?"

"పొద్దునవనగా వెళ్ళాడు...."

"హూ" మెడలోని రుద్రాక్షమాలను తీసి చేతిలో తిప్పుతూ దేవుడి గదిలోకి వెళ్ళారు కామరాజు.

సౌమిత్రీ, జనకపుత్రీ ఇరుప్రక్కల వెలయగా, ధనుర్ధారుడై నిల్చుని దరహాసాల విరజిమ్ముతున్న దాశరథిఎదుట నిమిషంకన్నతక్కువ సేపు కనుమోడ్చినిల్చున్నారు కామరాజు కండ్లుతెరచి మందసంముందున్న పంచపాత్రను తీసుకు బయటకువచ్చారు.

గౌరిలోని భూకంపం అలాగే ఉంది.

"అమ్మాయ్....గౌరీదేవీ!"

గౌరి కళ్ళు తెరిచింది!

మాట్లాడకుండా మూడు ఉద్ధరిణిల తీర్థం త్రాగించారు కామరాజు. తండ్రినిష్ఠ చిన్నప్పటినుండి ఎరిగినదే అయినా లలితకళ్ళు విప్పారినాయి.

"ఏమిటే, ఈ గొడవంతా?" నూతిలోనుండి వచ్చింది స్వరం.

లక్ష్మీనరసమ్మ నెమ్మదిగా గోడవారగా అడుగుతీసి అడుగు పెడుతూ వచ్చింది;

తూలబోయింది. విద్యుత్కిరణంలా లేచారు కామరాజు.

ఆమెను పొదివి పట్టుకున్నారు "ఇన్నాళ్ళయినా నీకింకా బుద్ధి రాలేదే లక్ష్మీ!"—ఆ మందలింపుకు సమాధానం ఆమె మందహాసం.

గౌరి నిశ్చలంగా కళ్ళుమూసుకుని ఉండడంచేత లలితవచ్చి అమ్మ నొకప్రక్క పట్టుకుని ఉయ్యాలపీటమీద కూర్చోబెట్టింది.

"అమ్మా! వలభై గంటలక్రితం నువ్వున్న పరిస్థితేమిటి, ఇవాళ ఇలా వెనకగదినుండి ఇంతదూరం నడిచిరావడమేమిటి."

"పోనీవే వెధవప్రాణం .... మూడేళ్ళనుండీ రోజూ ఒకచావు చస్తున్నా....ఒక్కసారేపోతే హాయి...."

"లక్ష్మీ! చిన్నదానితో ఏం మాటలవీ!"

కళ్ళొత్తుకుంటూ లేచి వెళ్ళింది లలిత.

"లేకపోతే ఏమిటండీ.... మీ చేత పనిచేయించుకోవలసిరావడ మేమిటి నా ఖర్మ.... దీన్నో ఇంటిదాన్ని చేద్దామంటే కుదరడంలేదుకదా! పెద్దదానిది తీరిపోయిందికదా అనుకుంటే దానిఖర్మ ఇలా ఈడ్పులతో కాలింది.... ఇహ చిన్నవెధవేమో తలక్రిందులయిపోతున్నాడూ.... కాస్త బాగావున్న పెద్దవా డొక్కడూ కంటికి దూరంగా మనవలసివచ్చింది.... ఇదంతా నా దురదృష్టమే—నేను లేకపోతే...."

"ష్! ఎక్కువ మాట్లాడితే తర్వాత ఆయాసం వస్తుంది........ ఊరుకో."

చెప్పుల చప్పుడయింది.

శివశర్మ వచ్చాడు.

"ఎక్కడికి కెళ్ళావురా?"

"ఇది చదవండి!" అన్న శివశర్మచెయ్యి ఉత్తరాన్నిచ్చింది; కంఠం నిప్పుల్ని చెరిగింది.

కామరాజు చదివారు. ఒక్క-క్షణంసేపులో ఆయన స్థితప్రజ్ఞత్వం బురదలో కాలువేయబోయి ఆగింది.

"మళ్ళీ అల్లుడు రాశాడాండీ?"

"అల్లుడు కాదు—కంసుడు!"—అన్నాడు శివశర్మ ఉత్తరీయంతో చెమట తుడుచుకుంటూ.

"ఏం రాశాడండీ"—మళ్ళీ అడిగింది లక్ష్మీనరసమ్మ.

"ఏదో మామూలేలే.... నువ్వురా పడుకుందువుగాని.... అమ్మాయ్ లలితా! అమ్మకు జావ కాచావా?"

"ఊహూ.... నానుండి మీరేమీ దాచనక్కర్లేదు చెప్పండి...."

"ఏమీ లేదులే...."

"నువ్వు చెప్పరా శివుడూ.... ఏం రాశాడు మీ బావ?"

చిన్నకొడుకువైపు చూశాడు కామరాజు. గోడవైపు తిరిగిన శివ శర్మ చెప్పాడు: "ఆ మూడువేలతో అక్కయ్యనిగనుక దశమిలోగా పంపించకపోతే తనకు రెండోపెళ్లి చేయిస్తానని చెప్పిందట వాళ్ళమ్మ—"

"ఆ.... ఆ.... అయ్యో.... గౌరమ్మతల్లీ.... నీ బ్రతుకి...."

మాట రాలేదు ఇంటి ఇల్లాలి నోటంట. కళ్ళవెంట కురిసింది కడుపుమంట....

—లలిత వడ్డించింది. తండ్రీ కొడుకూ కూర్చున్నారు. పప్పు, అన్నం, కూర, వడ్డించి నేతిచుక్క వేసింది. కామరాజు ఆకుచుట్టూ నీరు పరిషేకించి కొంతఅన్నం తీసి దూరంగా ఉంచారు.

నెయ్యి పడగానే పప్పూ, అన్నమూ కలిపాడు శర్మ.

లలిత నాన్నవైపు చూసింది. ఆయన బాహ్యదృష్టి ఇటులేదు; కాని అంతరంగం నిశ్శబ్దంగా ఏడిచింది

"పొద్దున లేచి ఎక్కడికెళ్లావురా?"

"గూడెంలో చదువు చెప్పడానికి...."

"అక్కడికి వెళ్ళవచ్చి స్నానం చెయ్యకుండానే భోజనాని కూర్చు న్నావా?"

"పొద్దున్న చేసే వెళ్లాను...."

"నే నింకా బతికే ఉన్నాను...."

"ఇష్టంలేనిదానిని ఇంకోరినెత్తిన బలవంతంగా రుద్దడం భావ్యం కాదు నాన్నా!"

"ఒరేయ్, అబ్బాయ్.... బెండకాయవేపుడు తినడం? పూలచొక్కాలు వేసుకోడంలాటి వాటిలో ఇష్టాయిష్టాలకు చోటుంది. కానీ—ఏ సూత్రాల నుండి మనజాతి ప్రాణవాయువు పీల్చుకున్నదో, ఏ ధర్మాలనీడను మన సంస్కృతి పెరిగిందో.... ఆ సూత్రాలు ఆ ధర్మాలు ఒకడి రాగద్వేషాలకు లొంగవివిరా, శివుడూ—వాటికి మనం లోబడాలి. అంతే...."

"అన్ని ఏండ్లు కంచెకట్టుకుని కూచున్నంతమాత్రాన చీకటి వెలుతురయిపోతుందా నాన్నా?"

"నీ కారణాలనిచ్చెన నన్ను చాల ఎత్తుకు తీసుకువెళ్ళలేదురా అబ్బాయ్!"

"హేతువుకు అతీతం కానంతకాలం భూమే, నా సర్వస్వంగా భావించుకుంటాను గాని కనపడని స్వర్గానికి అబద్ధాల నిచ్చెనలు వేసుకోలేను. నా పునాది నా ఆత్మవిశ్వాసమే...."

"ఒరేయ్....అందరూ అలా బయలుదేరినవాళ్ళే. ఆత్మవిశ్వాసం అన్నది చలికిచాలని దుప్పటి: చివికిపోయిన గొడుగు....చేతులు బారజాపి యావత్ప్రపంచాన్నీ కౌగిలిలోకి తీసుకుందామనేదశ దాటి-మించుతున్న నీ మంచినీ, పొంగుతున్న నీ ప్రేమనూ ఇలనంతటికీ కాకపోతే కొంతమందికయినా పంచిపెడదామన్న భ్రమనుండి బయటపడి-ఒక వ్యక్తినో, ఆశయాన్నో ఎన్నుకుని దానికి నీ బ్రతుకంతా అంకితం చేసినతరువాత-ప్రాణం పశ్చిమాద్రివైపు జారుతుండగా-దేహాన్ని పంచుకున్న భార్యగానీ, రక్తం ధారపోసి పెంచిన పుత్రుడుకానీ, ఒకే కంచంలోతిన్న మిత్రుడుకానీ నీకు అపరిచితులేననీ, నీలో నూటికి తొంభైపాళ్ళు వాళ్ళకు అనువసి నిసి అయిందనీ, తెలుసుకున్నప్పుడు-వెనుకనుండి వయస్సు లోతుతెలియని గోతివైపు తోస్తూంటే-కాళ్ళు శూన్యంలోకి తేలుతుంటే అప్పుడు తెలిసివస్తుంది నీ హేతువు కొలతలు: అప్పుడు కదులుతాయి నీ ఆత్మవిశ్వాసపు పునాదులు...."

"ఎవరి పాఠం వాళ్ళు నేర్చుకోవడం మంచిది నాన్నా!"

"వెర్రివాడా! పాఠంపేరు చదవడానిక్కూడా నీ జీవితకాలం చాలదు కదరా-"

ఏ క్షణాన ఏది పేలుతుందోనని ఉత్కంఠతో వింటున్న లలిత ధైర్యంచేసి పలికింది-"నాన్నగారూ! పులుసు వేయించుకోండి-"

....భోజనాలయ్యాయి!

శివశర్మ మిత్రుడు నారపరెడ్డి ఇంటికి వెళ్ళాడు....—

—....వినాయకుడిని చంకనుపెట్టుకున్న పార్వతిలా నీళ్ళబిందెతో తిరిగి వస్తూంది అమ్మాయి.

బయట—ఎండ. చెట్లనీడలో చల్లనిగాలి.

మనసులోని ఎండకు నీడలేవిటో....చల్లగాలి ఎలాగో?

నిర్భయంగా పాడుతున్న పక్షులపాటకు తాళంలా, అమ్మాయి పాదాలక్రింద ఎండుటాకులు చిట్ చిట్ మని విరుగుతున్నాయి.

వినాయకుడిగుడి వచ్చింది. ఎండుటాకులు విరగడం తగ్గింది. బిందె క్రిందకు దిగింది.

నమితశిరస్కయై, నిమీలితనేత్రయై నమస్కరించింది అమ్మాయి

కళ్ళు తెరిచింది.

ఓ అబ్బాయి నిల్చుని ఉన్నాడు.

"లలితా—!"

బిందె చంకనెక్కింది.

"లలితా....ఇంకా ఎంతకాలం ఉంటావ్?"

పక్షుల పాటకూ, ఎండుటాకుల తాళానికీ లయతప్పింది.

"ఇప్పటికే ఇరవైఏళ్ళు దాటావు. ఇంకా ఎప్పుడు చూస్తారు మీ వాళ్ళు—?"

పాదం తొట్రుపడలేదు, కానీ బిందెలోని నీళ్లు వణికాయి.

"మేము వైదీకులం, మీరు నియోగులని అంటారని భయమా?"

కంటిమేరలో ఊరిచివరి ఇల్లు కన్పించింది.

"నా చేతిలోకి అయిదువేల రూపాయలు ఇవ్వాళే వచ్చాయి."

"శత్రత్రాణకరీ సదాశివకరీ మాతా కృపాసాగరీ"

"దానితోబాటు మన వివాహం తిరుపతిలో చేసుకోవచ్చు...."

"సాక్షాన్మోక్షకరీ సదాశివకరీ విశ్వేశ్వరీ శ్రీకరీ"

"ఈ ఛండాలమయిన వూళ్ళొంచి ఈ రాత్రే వెళ్ళిపోదాం...."

"దక్షాక్రందకరీ నిరామయకరీ కాశీపురాధీశ్వరీ"

"ఆపైన నీ ఇష్టం.... నే వెళ్ళిపోతున్నా...."

"భిక్షాందేహి కృపావలంబనకరీ మాతాన్న పూర్ణేశ్వరీ...."

అబ్బాయి వెళ్ళిపొయ్యాడు.

అమ్మాయి నడిచింది.

మంచినీళ్ళకోసం వెళుతున్న సామ్రాజ్యమ్మ అడిగింది "ఏమి టమ్మాయ్! కళ్ళలా ఉన్నాయేం...."

"ఏంలేదు పిన్నిగారూ....కంట్లో ఏదో పడ్డట్లుంది...."

.... .... ....

—....శివశర్మ మిత్రుడు నారపరెడ్డి ఇంటికి వెళ్ళాడు.

"ఈ సంగతి విన్నారా శర్మగారూ—"

"ఏవిటి రెడ్డీ?"

"తాశీల్దారు నాయుడుగారి పంటకాలువని తన పొలంవైపు మళ్ళించు కున్నాడని శివారెడ్డిని నలుగురు మనుషులు కర్రలతో చావగొట్టారు...."

"ఏమిటీ!"

"అవునండీ—"

"శివారెడ్డి ఏడీ....ఎలా వున్నాడు?"

"ఇప్పుడే సూరిరాజు గుర్రబ్బండిమీద కర్నూలు పెద్దాసుపత్రికి పంపి వచ్చాను...."

"అయితే శివారెడ్డి ఆ పంటకాల్వ నలా త్రిప్పించాడంటావా?"

"వాడలాటి మనిషి కాదండీ....మొన్న పంచాయితీ ఎన్నికల్లో తాశీల్దారు నిలబెట్టిన నవరయ్యమీద శివారెడ్డి తమ్ముడు గెలిచాడు కదండీ—!

దేవుడిగదిలో బోర్లపడుకుని ఏడుస్తూవుంది లలిత. "శశాంక శేఖర ప్రాణవల్లభ, శరచ్చాంపేయ పుష్పాభనాసిక, అమృతాది మహాశక్తి సంవృత అవ్యాజ కరుణా పూర పూరిత"–అయిన లలితాదేవి నవ్వు తూంది.

"ఏమయిందే?"

"ఏమీ కాలేదన్నయ్యా."

"ఎందుకేడుస్తున్నావూ?...."

"ఏమీ లేదన్నయ్యా!"

"ఒసేయ్ వెర్రీ! నీ బాధేవిటో చిన్నన్నయ్యకు చెప్పరాదటే"

–తాను ఉప్పుమూట అయితే ఏనుగుగా మోసిన అన్నయ్య, తాను రౌతయితే గుర్రంగా మారిన అన్నయ్య, నేరేడుపండ్లందకపోతే అర్జును డుగా అవతరించిన అన్నయ్య, తన బొమ్మను ప్రక్కింటబ్బాయి లాక్కువి పాఠిపోతే పార్థసారథయిన అన్నయ్య, పాతఅన్నయ్య, నాన్నకు భయ పడే అన్నయ్య, ఇంట్లో అందరూ ఇప్పటిలాకాక, హాయిగా వుండిన రోజుల అన్నయ్య–తనకు తెలిసిన అన్నయ్య–కనపడ్డాడు లలితకు.

లలిత తలమీద చేతినుంచి–"చెప్పమ్మా లలితా?" అన్నాడు శర్మ.

దుఃఖం చెలియలికట్టదాటింది. ఏడుపుతో తడిసిన ఆమె గొంతు పలికింది.

"ఇందాక భోజనాలతర్వాత నువ్వెళ్ళిపోయావు. కాసేపుంది నాన్న వెళ్ళారు. అక్కయ్యకు మజ్జిగన్నంపెట్టిచూస్తే మంచినీళ్ళులేవు. బిందె తీసుకువి చెరువుగట్టుకు వెళ్లివస్తుంటే–సిద్ధాంతిగారబ్బాయి ఎదుర య్యాడూ...."

"ఎవడూ....మల్లికార్జునమా ఏమన్నాడు శంత....వాడితోలు ఒలి చేస్తాను చెప్పు...."

"అందుకనే నీతో చెప్పాలంటే భయం వేస్తుందన్నయ్యా...."

"చెప్పవే...."

చెప్పింది—చెల్లెలు.

"అరి తొత్తుకొడకా! పూజారికొడుకుగా, పరమ సాధువుగా కన పడుతూ....! హుం....నీడొక్క చించకపోతే నాపేరు శివుడుకాదు...."

హాల్లో పెద్దపెట్టెలోవున్న గొడ్డలివి తీశాడు శివశర్మ.

మానవుడు శివుడు దేవుడు శివుడిలా అయ్యాడు....

"అ....న్న....య్యా....!"

దిగంతాలకందినగొంతు అన్నయ్యకందలేదు.

పాండవులను హతమార్చబయలుదేరిన బలరాముడిలా అడుగు వేసిన శర్మకు—గుమ్మంలో కామరాజు ఎదురయ్యాడు.

శివుడికళ్ళల్లో చిచ్చు విచ్చుకుంది.

"దారి విడవండి!"

"ఎక్కడికి?"

"నలుగురి ఎదుట ఋష్యశృంగుడై, ఏకాంతంలో కాంతల పాలిటి రావణుడయిన అప్రాచ్యుడి తల తీయడానికి—"

కామరాజు లోపలికి చూశారు. పెనుగాలిలో అగ్నిశిఖలా వణికి పోతూ నిల్చుంది లలిత.

"—చేసిన దొంగతనానికి మూతగా దేవుడిపేరు వాడుకునే వంచకు లను చించడానికి వెళ్ళుతున్నాను—జరగండి—"

"ఎవరది?"

"తాశీల్దారునాయుడు—"

"ఏంచేశాడు?"

"నీకు తెలియదా?"

"చెప్పు!"

"పదివేల డబ్బు—ప్రజలది అరగించి అది పూర్తిచేయడానికని శివలింగాన్ని సృష్టించి—"

"నోరు ముయ్యి—"

"నాన్నా!—"

"అమ్మా....." అంటూ లోపలికి పరుగెత్తింది లలిత.

"నా కొడుకునోట దైవదూషణ వినేముందు నా తల క్రింద పడనీ—"

"లలిత నొంటరిపాటున అవమానించి—"

"ఎవరు?"

"మీ పూజారికొడుకు—చెల్లాయిని ఒంటరిపాటున నానామాటలూ అని—"

"అందుకని బ్రహ్మహత్య చేస్తావుట్రా?"

"నాన్నా! వాడు బ్రాహ్మడుకాడు; వాడిని చంపడం హత్యకాదు."

"ఒరేయ్—శివుడూ! నేను నీ తండ్రిని—చెబుతున్నాను. ఆ గొడ్డలి వెనక్కి—పెట్టి వెళ్ళు!"

"నాన్నా! అవినీతికి దైవాన్ని ఆచ్ఛాదనగా వాడడమూ, అసభ్యతపట్ల ఔదార్యం చూపడమూ నాచేతకాదు—"

"చెప్పుడుమాటలువిని జంతువుగా మారగల్గిన మానవులకు అవినీతి, అసభ్యతా అనవసరం—"

"నాన్నా!"

"గొడ్డలివింకా వదల్లేదు నువ్వు...."

"అది వదిలిపెడితే నే నీ ఇంట్లోకి రాలేను"

"నా కొడుకొక్కడు హంతకుడవ్వడానికన్న నాకున్నది ఒక్కడే కొడుకనుకోవడం సులభంకదూ—"

మాట్లాడకుండా గొడ్డలిని తీసుకుని వెనక్కి వెళ్ళాడు శర్మ.

లలిత వద్దువద్దని పట్టుకుంటుండగా "అబ్బాయ్—శివుడూ! ఒరేయ్... దుర్మార్గుడా! విన్నుకన్న దేవుడిమీదికి గొడ్డలి నెత్తావుర్రా—ఒరేయ్—నాయనా—? వెళ్ళకురా—ఎక్కడికివి వెళ్ళకు, వెళ్ళకు ఒరేయ్...." గొంతెత్తి అరుస్తూ వచ్చింది లక్ష్మీనరసమ్మ.

కామరాజు ఒదిగి నిల్చున్నారు; కళ్ళు మూసుకున్నారు.

వీధిలోకి అడుగుపెట్టిన శివశర్మకు—'అమ్మా' అన్న లలిత ఆక్రందనం వినిపించింది. క్షణంలో సగం సేపు అతడి నడక ఆగింది.

నలభై రెండేళ్ళు తన జీవితం పంచుకున్న భాగస్వామినిని ఒడిలోకి తీసుకుని ఆమెచేతిని తీసుకున్నారు కామరాజు.

శివశర్మ ముందుకు నడిచాడు—నడవలేక.

కామరాజు వదిలినచేయి క్రిందపడింది. కదలలేదు....

....ఆరాత్రే డాక్టర్ రఘు ఇంటికి వచ్చాడు. కాని సిద్ధాంతిగా రబ్బాయి ఇంటికి రాలేదు.

*　　　*　　　*

దేవుడు—ఏడీ?

నీతి—ఏదీ?

నలుగురూ కలిసి నలుగురికోసమూ అని గీతలు గీచుకుంటారు. గీచుకున్న గీతలకే బానిసలవుతారు. తమ మంచికోసం తాము విర్ణయించుకున్న అలవాట్లే ఆచారాలయి, సూత్రాలయి, శిలాశాసనాలుగా నెత్తిమీద నర్తిస్తాయి. తన ఉద్యోగం, తన హోదా, ఏదిచేసినా తన హోదాకు తగినట్లే నడవాలి. చావుకు ఏడుస్తుంటే తంజావూరు బ్యాండు పెట్టుకోవాలి. నట్టేట మునిగినా, కూతురిపెళ్ళి నల్గురూ ఓహోహో అనేటట్లు చేయాలి. అందుకు డబ్బుకావాలి. డబ్బులేకపోతే, అప్పుపుట్టకపోతే, దొంగతన

మయినా చేయాలి. ఆ పనే చేశాడు-తాశీల్దారు నాయుడు అది అతని తప్పా?

ఊరుంది. ఊరంత పేరుంది. మంచిపేరుంది. చెడ్డపేరూ వుంది. నాలుగు ఊళ్ళల్లో సత్రాలుకట్టించిన శిబిరాజన్న మంచివుంది. ఎవరైవేల వెండిరూపాయలకోసం పెళ్ళానికి విషంఇచ్చి చంపాడన్న చెడూవుంది. అహో బలశ్రేష్ఠి తాశీల్దారుతో చేతులు కలపడం ఒక వింతా?

నాలుకపైన నీతులనాట్యం. మానసంమీద కోతులనాట్యం. శ్రీరంగ గోపురాల నీడల్లో దొమ్మరిగుడిసెలు. వివాహానికి వెలుపలపుట్టిన పిల్లలిద్దరిని పెంచడానికి, నాలుగుడబ్బు లిస్తానంటే తాశీల్దారుమోచేయి నాకడం సిద్ధాంతి దోషమా?

వెలుతురులో వేలుపు, చీకటిలో సైంధవుడు, అందరికీ దూరంగా అమ్మాయిలమార్గంలో పూలరంగడై, గొడ్డలిపేరు వినగానే బృహన్నల కావడం మల్లికార్జునం లోపమా?

ఒకరు. ఇంకొకరు. నలుగురు.

ఒకరి కొకరు తోడుదొంగలు.

దొంగలు కొంగజపంచేస్తే దేవుడిలాటిమనిషి అందులోకి కాలు జారారే-! ఆ శివలింగనిధితో ఈ వూరికో పాఠశాల కట్టిస్తే? తానూ నారప రెడ్డి గూడెంలోకివెళ్ళి విద్యను పంచనక్కరలేదే! ఆ డబ్బుతో ఆసుపత్రి కట్టిస్తే? పీష్టలు పగిలినపుడు యాభైమైళ్ళు గుర్రబ్బండిమీద, చావు బతుకుల మధ్య, ప్రయాణం చేయనక్కర్లేదే!

యదార్థంతో దాగుడుమూత లెందుకు?

సరళరేఖలో బ్రహ్మముడు లెందుకు?

-ఇందరికీ, ఇన్నిటికీ, గొడుగు-దేవుడు.

దేవుడివన్నీ సహిస్తాడా? సహిస్తే దేవుడేనా?

దేవుడు సహించినే? మానవుడు సహించకూడదు.

ఆ దేవుడినే వహించకూడదు.

తలారి వీరయ్యగుడిసెలో అరగంటవుండి బయటకు వచ్చాడు శివ శర్మ.

.... .... ....

రాత్రి పదికొట్టి గంట కావస్తూంది.

వీధిఅరుగుమీద తువ్వాలు పరచుకుని కూచున్నారు కామరాజు.

'మాత్రాస్పర్శాస్తు కౌన్తేయ శీతోష్ణ సుఖ దుఃఖదాః

ఆగమాపాయినో నిత్యాస్తాం స్తితిక్షస్వ భారత....'

"కామరాజుగారూ! కామరాజుగారూ!"

"ఎవరదీ_?"

"నేనండీ! నాయుడుగారి వెంకటయ్యాపీ_"

"ఏమిట్రా_నిశిరాత్రి?"

"అయ్యో! ఘోరం జరగబోతూంది_పరమ ఘోరం_!"

"ఏవిటో చెప్పూ!"

"పొలిమేరలో శివలింగం వెలిసింది కాదుటండీ_"

"అవునూ"

"దాన్నివాళ రాత్రి రెండుగంటలకు పెకలించేస్తార్టండీ_"

"ఎవరు చెప్పారూ?"

"తలారి వీరయ్య తాగి తందనాలాడుతూ అదే పాటటండీ_"

"ఓరి వీ!.... ఇంతచేస్తే తాగుబోతువెధవ కూతలా_?"

"కాదండీ_దేవుడికే అపకారం తలపెడితే ఇంకేమన్నా వుందా? మనూరు భగ్గుమనిపోదండీ?"

"దేవుడికేమీ జరగదు. నువ్వు పొలానికి వెళ్ళు వెంకటయ్యా_"

-పావుగంట తర్వాత జగద్రక్షకుడికి రక్షణ కరువుకాగా, భక్తి శక్తిగా, విశ్వాసం వెలుతురుగా, చీకటిలోపడి వెల్తున్న దొకరూపం.

మిణుగురుపురుగుల వెలుతురులో ఆ వ్యక్తి కుడిచేయి తళుక్కు-మంటూంది.

ఇవాళ-నిన్నలో కలిసే వేళయింది.

గడ్డపార గంటసేపు పనిచేసింది.

చుట్టూ తవ్వడం అయింది.

రెండుకొట్టింది.

శివలింగం క్రింద గడ్డపార జాగ్రత్తగా ఆనించాలి. ఆనించి పెకలించాలి పెకలించి దూరంగా తీసుకువెళ్ళాలి. తండ్రిని బిడ్డ రక్షించుకోవాలి. దుర్మార్గుల చెయ్యి తగలకుండా కాపాడుకోవాలి.

అలనటో! వయనో!

ఎదురుగా ఏదో లేచింది.

పొడుగ్గా పైకి లేచింది.

చేతిలో గడ్డపారవుంది.

నెత్తిమీద గునపం మోగింది.

"పరమశివా—!"

అమ్మ బిడ్డను పిలిచే కేక.

భూమి ఆకాశంలో కలిసే కేక.

అణువు ననంతంలో చేర్చేకేక.

శివలింగానికి శోణితంలో స్నానమయింది.

"వీరయ్యా! టార్చేదీ!"

వెలుతురులో చీకట్లు.

"నాన్నా!"

"నాన్నా—నాన్నా! నాన్నా!!"

చుట్టుప్రక్కల ప్రతీ ఆకూ మారుమోగింది.

దరిదాపుల ప్రతీరాయీ ప్రతిధ్వనించింది.

—శివలింగంమీది నెత్తుటిని కన్నీరు కడిగింది.

—లిప్తమాత్రం కండ్లు తెరిచారు కామరాజు: శివశర్మ మార్కండేయుడై కనుపించాడు!

('భారతి' జూలై 61)